# స్వప్నభంగం – 3 (పెద్ద కథ)

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్, Hyderabad, AP

తాయారు, శ్రీనాథుడు తిరుపతి కొండ మెట్లెక్కడం మొదలు పెట్టారు.

పెట్టెను మాత్రం తమ వూరి నుండే మొక్కుకై వచ్చిన ఒక తెలిసిన వాడితో బస్సులో ముందుగా పంపించారు.

బాగా ఎండ తగ్గాక సాయంత్రం ఏ మూడున్నర నాలుగు గంటలకో నడక మొదలైంది.

ఒక్క మోకాళ్ళ పర్వతం చేరడానికే గంటకు పైగా పట్టింది. 'ఏడు కొండలవాడా! వడ్డికాసులవాడా! అడుగడుగు దండాలవాడా! గోవిందా! గోవిందా!' కొండ నెక్కుతున్న భక్తుల నిరవధిక స్తోత్ర పాఠాలు

" అబ్బా - నేనింక ఎక్కలేను బాబూ " తాయారు ఓ గోపురం వద్ద కూలబడింది.

శ్రీనాథుడు నవ్వాడు -

" మంగా! శ్రమిస్తే కాని శ్రీనివాస సాన్నిధ్యం లభించదని దానిలోని అంతరార్థం. ఇంటి నుండి కారులో బయలుదేరి స్వామి వారి సింహద్వారం ముందు దిగితే అతడికి స్వామినందుకోవడంలో వున్న కష్టం ఎలా తెలుస్తుంది? అందుకే చూడు శ్రీశైలం, తిరుపతి, అమర్‌నాథ్, బదరీ, అన్నీ పర్వతాగ్రాల మీద, కీకారణ్యాల మధ్య దాటవీలుకాని నదులకు నడుమ నిలిచాయి వెలిశాయి ",

తాయారు శరీర శ్రమను భర్త మాటలు పోగొట్టలేక పోయాయి. ఆ గోపురంలో సోడాలు అమ్ముతున్నారు.

తాయారు ఓ సోడా తాగింది.

కాసిని పల్లీలు బటానీలు కొనుక్కొని తిరిగి నడక సాగించింది.

శ్రీనాథుడు మాత్రం హుషారుగా పాలపిట్టలా దూసుకుంటూ ముందుకు సాగాడు.

భక్తులు రకరకాల వేషాల వాళ్ళు, భాషల వాళ్ళు, వయసుల వాళ్ళు మూటలు కూడ నెత్తిన పెట్టుకొని నడక మార్గంలో పయనం సాగిస్తున్నారు.

రకరకాల కోరికల వాళ్లు

గమ్యాల వాళ్లు

చేస్తున్న రత్నాల వ్యాపారంలో లాభం వచ్చినందుకు నడిచి ఎక్కే మొక్కు చెల్లించి ఓ రత్నాన్ని స్వామి వారి హుండిలో వేసేందుకు వస్తున్న బీదరు చెన్నబసప్ప -

కూతుళ్ళ పెళ్ళి కోసం గత్యంతరం లేక పొలమూ, ఇల్లూ అమ్మి పెండ్లి పూర్తి చేసిన ఓ తండ్రి, ఎన్నికలలో నిలబడి గెలిచి పదవి సంపాదించి అది ఇప్పించినందుకు గాను బాలాజీకి తలనీలాలు సమర్పించడానికి వచ్చిన ఒక ము.పి.వాలా.

దత్తు తీసుకున్న ముసలమ్మ త్వరగా కాలం చేసి ఆస్తి, అధికారం చేతికి వచ్చినందుకు - కల్యాణం చేయించడానికి బయలుదేరిన ఉలవపాడు వెంకయ్య; నయం కాదనుకున్న టి.బి. నుండి బయటపడి పత్నీ సమేతంగా నేరుగా రాయవెల్లూరు నుండే తిరుపతి కొండ ఎక్కుతున్న సాయిలూ, రత్నావళీ!

' తాయారూ! కోరికలు తీస్తున్న కొద్దీ నీరూరే దొరువుల వంటివి. వాటిని పరమేశ్వరుడైనా సరే సమగ్రంగా ఎలా తీరుస్తాడు? '

మంగకు ఈ మాటలు రుచించలేదు. ' కవిరాజా! కోరికలు ముత్యపు చిప్పలు కూడ కావచ్చు. కొందరు భక్తుల హృదయాలు స్వాతి వానకు పడే పరమేశ్వరుని అనుగ్రహ రస బిందువులకై ఎదురు చూస్తూ వుంటాయి. ఒక కిరణం, ఒక తుషారం పడితే చాలు ముడుచుకొని లోలోపల దానిని ముత్యంగా మార్చుకుంటాయి.

శ్రీనాథుని హృదయం పరవశించి పోయింది.

మంగతాయారిప్పుడు ఉత్తమ జాతికి చెందిన కవిత్వం చెప్పింది. తన సహవాసంతో ఆమె జన్మ పునీతమైంది.

' మంగా! ఇంత చక్కని ఉపమానం ఎలా చెప్పావు?'

' ఏదో మీ దయవల్ల, పూలతో కూడిన దారానికి వాసన పట్టదూ చందన వృక్షం చుట్టూ వున్న తరువులన్నీ చందన వృక్షాలుగానే మారవూ. అలాగే "

ఈ ఉదాహరణలన్నీ తాను ఏదో సందర్భంలో వాడినవే - వాటిని తాయారు జాగ్రత్తగా జ్ఞాపకం పెట్టుకున్నది - మళ్ళీ తన మీదనే ప్రయోగిస్తున్నది.

తాయారు చాలా మందంగా నడుస్తున్నది - అందువల్ల శ్రీనాథుడు మనోవేగాన్ని గమనవేగంతో అనుసంధానించ లేకపోయాడు.

త్రోవకిరువైపులా రకరకాల చెట్లు, రంగు రంగుల పండ్లు. పండ్లన్నీ తినడానికుపయోగపడేవి కావు. పూలన్నీ సుగంధాన్ని వెదజల్లేవి కావు - అయినా సరే! అన్నీ ఉండాల్సిందే - సృష్టిలో దేని స్థానం దానిదే! అవేమి ఓషధులో!

చీమలు బారులుగా సాగిపోవడం వల్ల రాతికి బాగా వేలెడు వెడల్పు బాట ఏర్పడింది.

ఎన్ని యుగాలిలా చీమలు నడిస్తే రాయి చీలిందో, ఎన్ని తరాల భక్తుల నిరంతర పాద ఘట్టన చేత ఈ పుట్టలూ గుట్టలూ బాటలుగా పేటలుగా మారాయో.

" తాయారూ! చూడు, చూడు ఈ రంగుల పిట్టలెలా ఎగురుతున్నాయో - తోక ఎరుపూ తెలుపూ, దేహమంతా నలుపు, తలమీద వేలెడు కిరీటం - ఓహో! ఈ ఒక్క పక్షిని చూస్తే చాలు తాయారూ మన శ్రమ మొత్తం పోయి యాత్ర సార్థకం కావడానికి' -

తాయారు కోపంతో అన్నది ' పక్షులూ, కోతులూ చూసి యాత్ర సార్థకం చేసుకునేందుకు కాదు మనం వచ్చింది - మొక్కుబడి చెల్లించుకోవాలి. స్వామి వారిని చూడాలి.'

" అదీ చూస్తాము. ఇదీ చూస్తాము - ఇదంతా చూడటం కూడా అది చూడటంలోని భాగమే! ఆ విశాల నేత్రాల వాడి కరుణా కటాక్షమే ఈ ప్రకృతిగా పరిణమించి మనలను పలకరిస్తున్నది - దేహం పులకరిస్తున్నది."

' కానీ స్వామీ! యాత్రికులంతా అంత తెలివి మీరిన వారు కారు. తమ దోవ వెంట తాము పరుగెత్తుకుంటూ పోతున్నారు.'

' మూర్ఖులు - వాళ్ళంతా భక్తులు కాదు తాయారూ - చాలామంది బేరగాళ్ళు - స్వామివారి కటాక్షాన్ని అలుసుగా తీసుకొని బేరం వేసి లాభం వస్తే వడ్డీ చెల్లించేందుకు పరుగెత్తుకు పోతున్నారు - వాళ్ళకి తురాయి పిట్టల తోకలు కన్పడవు - రాళ్ళ మధ్య దారి పక్క పూచిన గడ్డిపూవు పలకరింపు వినపడదు. ఆకాశంతో ఈ చల్లని వేళ సప్తాశ్వాల నుండి ఒక తెల్లని కిరణం ఏడురంగుల పూలను పూయిస్తున్నప్పుడు ఏడవ కొండపై నుండి చూడటం పేరు భగవదుపాసన కాదా? కాని ఆ ఉపాసన చేయలేరు వీళ్ళు - కేవలం పరుగెత్తుతున్నారు కాలాభిముఖంగా - శలభాల్లాగా - జీవచ్ఛవాల్లాగా '.

తాయారుకు భర్త స్వామి దూషణ చేస్తున్నాడనిపించింది - ' మీ పిచ్చి మితిమీరి పోతున్నది - దేవునికభిముఖంగా పోయే భక్తులను దూషిస్తే మీకు పుట్టగతులు వుండవు - '

' తాయారూ - తాయారూ నీదింత మట్టి బుర్ర అనుకోలేదు. దేవుణ్ణి నేను తిట్టడం లేదు - దేవుడు ఏడుకొండల పైనే కాదు ఏడుకొండల నిండా వున్నాడు చూడమంటున్నాను - ఆరాధించమంటున్నాను - ఇంతకన్నా సరళాతి సరళంగా ఇంకెలా చెప్పను. నా వేందాంతం - కొండ పైనా కిందా మీద లోపలా కూడా స్వామి నాకు దర్శనమిస్తున్నాడు ''.

ఒకచోట కొండ పైభాగం నుంచి జలధార సన్నగా ప్రవహిస్తున్నది. కింద కాశీరత్నం తీగెలు అల్లుకొని వున్నాయి -

ఆ పక్కనే కొన్ని పేరు తెలియని గడ్డిమోదుగు ఆకులూ - జలబిందువులు కొన్ని మోదుగు ఆకుల పైబడి, చింది తుషారాలుగా మారి కాశీరత్నం పూల చిన్నారి రేకులపై చిద్రుపలుగా రాలాయి - కారిన ఆ నీటి రేఖ గాలిలో కలిసి చల్లదనం కిందికి పరివర్తన చెందింది.

" ఓహో! దివ్య సౌందర్యానికిది పరాకాష్ఠ! పరమేశ్వర తత్వానికిది ప్రత్యక్ష వ్యాఖ్యానం - సౌందర్య గుణం సాకారంగా నిలిచి జలం వాయువుగా స్పర్శగా మారి శబ్దంగా పర్యవసిస్తున్నది. అనుభూతి పరిణామం చెందుతున్నది. తాయారూ - ఇదుగో స్వామి వారినిక్కడ చూడు - పలుకు తేనెలతల్లి పవ్వళించిన వేళ సద్దు సేయకు తాయారూ - "

అన్నమాచార్యుని కీర్తనలు ఆయనలో పొంగి పొర్లుతున్నాయి - దూరాన చంద్రగిరి దుర్గం పురాతన వైభవానికి చిహ్నంగా కొడికట్టిన దీపంలా కన్పడుతున్నది.

" ఇదుగో! ఇటు చూడు తాయారూ! అగాధమైన లోయల్లో నుండి ఉవ్వెత్తున తారాజువ్వల్లా పైకి లేచిన ఈ చెట్లు ప్రకృతి దేవాలయానికి సగర్వంగా ఎత్తిన ధ్వజస్తంభాల్లా వున్నాయి - పరమేశ్వరుని పాదార్చన కోసం పుడమితల్లి దాల్చిన పూలకిరీటంలా వుంది ఈ లోయలో తల పైకెత్తిన చెట్ల సౌందర్యం " శ్రీనాథుడు ఏదో లోకంలో విహరిస్తున్నాడు. అక్కడ బస్సు రోడ్డూ - కాలిబాట - కలుస్తాయి.

తాను మాత్రం అలసిపోయి కాలిబాట చివర కూర్చున్నది తాయారు- ఇంతలో ఓ కారు ఆ మార్గాన దూసుకుంటూ పోతూ తాయారును చూసి ఆగింది.

వెంటనే కారు తలుపు తీసుకొని వైదేహి దిగింది.

తలెత్తి తాయారు చూసింది ఆశ్చర్యంగా. ' అక్కా'

" తాయారూ - ఎప్పుడు బయలుదేరారు - ఏమిటి? "

అక్కకు చెల్లెలు తన తీర్థయాత్ర క్రమం వివరించింది.

" రానూ పోనూ నడచి వస్తామని మొక్కుకున్నా మక్కా - అందుకని....... ".

" అరే - మాకు, కనీసం జాబన్నా వేయలేదేమిటి? " వైదేహి సాధించింది.

" నేనేం కలగన్నానా మీరూ ప్రయాణం పెట్టుకున్నారని "-

"ఔను - అది కూడ నిజమే - మా వారికి ఈసారి బిజినెస్‌లో బాగా లాభం వచ్చింది - సారాయికి పనికి రావనుకున్న అనాబ్‌షాహిని ఉత్తరాది వాడొకడు హోల్‌సేల్‌కు కొన్నాడు - రూపాయికి రెండు రూపాయల లాభం- అందుకని వారు అకస్మాత్తుగా ఇలా ప్రయాణం పెట్టారు. రాత్రి బయలుదేరాము. కారులో హైదరాబాదు నుంచి " - శ్రీనాథుడు కారు డ్రైవింగ్ చేస్తున్న లక్ష్మణమూర్తిని పలకరించాడు.

లక్ష్మణమూర్తి ముభావంగా, మర్యాద సూచకంగా ఏవోయథోచితమైన మాటలు నాలుగు మాట్లాడాడు. ఆ మాటల్లో ఆప్యాయత లేదు. సమానస్థాయి వాణ్ణి గౌరవించినట్లు లేదు.

" తాయారూ రండి, కారెక్కండి ఇద్దరూనూ. ఓహో - మొక్కు కదూ, సరే! మేము కాటేజి ముందే రిజర్వు చేయించాము - మీ కోసం పైన ఎదురుచూస్తుంటామయితే " వైదేహి చెల్లెల్ని, బావగారినీ తమ కాటేజీకి ఆహ్వానించింది.

లక్ష్మణమూర్తి కాటేజి నెంబర్ చెప్పాడు.

శ్రీనాథుడు తల వూపాడు.

వైదేహి కారెక్కింది.

చెల్లెల్ని విష్ చేస్తూ చెయ్యి వూపింది.

కారు తారు రోడ్డు మీద దూసుకొని పోయింది.

ఊవుతున్న వైదేహి చేతి రత్నాల ఉంగరం కాంతులు కనపడుతున్నంత దూరం అలాగే చూసి ఆ తర్వాత లేచి తిరిగి నడక కుపక్రమించింది.

శ్రీనాథుడు నడవలేకపోతున్నా హుషారు తగ్గకుండానే సాగిపోతున్నాడు.

తాయారు మాత్రం ఇకపైన నడవలేక పోయింది.

వైదేహి కారు చక్రాల చారల్లో తన అడుగులు వేసి ముందుకు సాగలేక పోయింది.

చీకట్లు నలుమూలలా ముసిరాయి.

దూరాన తిరుమల దీపాలు మిణుకు మిణుకుమని కన్పిస్తున్నాయి.

" మంగా "

" ఆ ( "

" కొంచెం వేగంగా అడుగులు వేయాలి ".

" నడవలేక పోతున్నానండి "

' నిజమే! కాని చీకటి పడింది చూడు - అంటే ఇప్పటికే సుమారు మూడున్నర గంటలకు పైగా నడిచాము '-

' . .... . . . . . . . . . . '

' మంగా '

' ఏమిటి '

' స్వామి వారి చుట్టూ దీపాలెన్ని ఉన్నా చుక్కలాంటి మిణుగురుల్లాంటి ఈ క్షణికమైన విద్యుత్కాంతితో ఆయన సంతృప్తి పడడు, భక్తపరాధీనుడైన శ్రీనివాసుడు మంగతాయారు రాక కోసం ఎదురు చూస్తుంటాడు - చంద్రుని కోసం సముద్రంలా -'

" స్వామీ త్రాచులా సాగుతున్న ఈ తారురోడ్డు పై మీరే సాక్షాత్తు శ్రీనివాసునిలా వున్నారు - నేను కేవలం మీ ఛాయలా నడుస్తున్నాను - చూడండి, ఎందుకొచ్చిన కవిత్వమిది - నడవలేక ఒకవైపు అవస్థపడుతుంటే"

' కవిత్వమంటే ఏమిటి? అదేదో రాజసభల్లో రసికజనులు వినోదించే సాధనమనుకున్నావేమో - కాదు. అది నిత్య జీవితంలో అనుక్షణం అనుభవించ దగ్గ అమృత రసాయనం. తెలియకుండానే ప్రతివాడు వాడే ప్రతి పర్వరసోదయమైన వచన కావ్యం. ఈ మేడలాకాశాన్నంటాయి. ఈ పొట్లకాయ చూడు బారెడు పొడుగున ఉంది.

వాడమ్మ కడుపు బంగారం కానూ ఏం చేశాడయ్యా, వాడా వాడొక ధర్మరాజు, ఆ పిల్ల గారె ముక్కలా వుంది - నీ బుగ్గలు గిల్లి బూరెలు వండుతాను - తాయారూ ఏమిటి ఇవన్నీ - ఈ ఉక్తివైచిత్రి మొత్తం కవిత్వం కాదూ - ఇదంతా కవిత్వమని తెలిసే స్త్రీలు సంభాషణల్లో వాడుతున్నారంటావా?

మంగతాయారు మనస్సు అన్యాసక్తమై వుంది.

' ఏమండి '

' ఏమిటి '

' వైదేహి కొంచెం లావెక్కింది సుమా! '

' ఆ ( మీ బావగారు కూడ చిన్న కుంభకర్ణునిలా వున్నాడు '.

" ఎందుకండీ ఆయనంటే మీకంత అసూయ?"

" అది నేనవలసిన మాట - నిరంతరం వాళ్లు నీ మనస్సులో మెదలుతూ వుండటం వల్ల అసూయతో వాళ్ళ సంభాషణకే ఉపక్రమించావు. నాకెందుకసూయ? నాకేం ఆబిడ్స్‌లో బ్రాందీ షాపు వుందా? నాకూ లక్ష్మణమూర్తికి అనాబ్‌షాహిలో పోటీ ఏమైనా వచ్చిందా?? ఆయనది మద్యం వ్యాపారం. నాది హృద్యమైన పద్య వ్యవసాయం. పద్యానికి, మద్యానికి మొదట్లో పోలికే లేదు, తర్వాత ఉన్నట్లు కన్పడ్డా ఉపనిషత్తులో ' ద ' కథలాగా ఒకటి ఆత్మానందాన్ని ఇస్తే రెండవది పాశవికానందాన్ని చవి చూస్తుంది - తాయారూ- ఎవడి అర్థం వాడిది - ఎవడి అనుభూతి వాడిది - వాళ్ల గూర్చి మనం ' ఆ ' జన్మ శత్రువులు గాను భావించనక్కర లేదు. 'ఆ' దర్శంగాను స్వీకరించవద్దు - 'ఆ' కార సామ్య మున్నంత మాత్రానా రెండు ఒకటి కావు- ఇర్వురలో ' ఒకటి ' కావడం ఎలా సాధ్యం? '

శ్రీనాథుడు శబ్ద బ్రహ్మోపాసకుడు -

కాబట్టే అతని ప్రతి మాట వ్యంగ్య వైభవంతో శోభిల్లుతూ వుంటుంది. ప్రతి పదానికి వెనుక మరికొన్ని అర్థాలు వాటంతట అవే భాసిస్తూ వుంటాయి.

మొదట్లో పోలిక లేకపోవడం, అర్థం, ఆకారసామ్యం, అన్న చమత్కారాలు మంగకు అర్థం కాలేదు. కాని ఇర్వురం ఒకటి కావడం ఎలా సాధ్యం అంటే ఇటు శ్రీనాథుడూ అటు లక్ష్మణుడూ ఒకటి కాదని సూచించడం బోధపడింది.

అంటే దేవునికి, జీవునికీ భ్రాతృత్వమే కాని ఐక్యం లేదని శ్రీనాథుడు సిద్ధాంత ప్రతిపాదన చేస్తున్నాడని కూడా మంగ తాయారుకు స్ఫురించింది.

అయితే ఆమె మనస్సు ఈ చమత్కారాలను ఆనందించే స్థితిలో లేదు.

రాత్రి ఏడున్నర ప్రాంతానికి తిరుమలలోకి ప్రవేశించారు.

బస్సు దిగే చోట తమ ఊరి మల్లయ్య తన కొడుకు వెంకటాద్రిని కూర్చోబెట్టాడు.

వెంకటాద్రి శ్రీనాథ దంపతులను తమ వెంట మల్లయ్య దిగిన ధర్మసత్రం దగ్గరికి తీసుకొని పోయాడు.

" ఆరుగురి పేర ఈ గది తీసుకున్నాను. మీరూ ఇందులో వుండవచ్చు. నేనూ మా ఆవిడా, వెంకటాద్రీ ముగ్గురమే కదా అందులో వున్నది" అన్నాడు మల్లయ్య.

తాయారు శ్రీనాథుణ్ణి ఇవతలికి పిలిచి అడిగింది.'ఇక్కడ సౌకర్యాలన్నీ ఉండవు - మా అక్కగారి కాటేజికి పోదాము'.

శ్రీనాథుడు నవ్వి ' మనం ఇక్కడ మొక్కు కోసం - స్వామి దర్శనం కోసం వచ్చాము కాని భోగాల కోసం రాలేదు - ఇక్కడే ఉందాము ' అన్నాడు.

బంధువులకు దగ్గరగా ఉండటం భర్తకెందుకో ఇష్టం లేదని తాయారు భావించింది.

ఆ బంధువులు తన బంధువులు - రక్తం పంచుకొని పుట్టినవారు - అందుకనే తాయారుకు చాలా బాధ కలిగింది - రాత్రి తెల్లవార్లూ కాళ్ల నొప్పులు తీర్చుకున్నది.

మర్నాడు ఉదయమే లేచి కాలకృత్యాలు నిర్వహించుకొని, స్నానం చేసి శుచియై తాయారు ఇవతలికి వచ్చే సరికి శ్రీనాథుడు కన్పడలేదు.

ఆయన ఏ తెల్లవారుజామునో లేచి శ్రీ పర్వతం పైనుండి మేఘాలను అందుకుంటూ వున్నాడని గ్రహించింది.

మల్లయ్యా, వెంకటాద్రి, రత్తాలు, ఉదయమే ఇడ్లీలు తిన్నారు.

ఇడ్లీ, ఉప్మా, పెరుగు, పాలు, అన్ని సత్రాలకే అమ్మకానికి వస్తాయి

తాయారు మాత్రం పచ్చి మంచినీళ్ళు పుచ్చుకోలేదు.

సూర్యుని కిరణాలు బంగారు మలామును పర్వతం మొత్తం పూస్తుండగా శ్రీనాథుడు వచ్చాడు.

' స్వామి వారి దగ్గర కూడా ఉషస్సును మరిచిపోలేదే '.

'తాయారూ,శ్రీపర్వతంమీదఉషస్సునీవైభాసించింది-స్వామివారు నాలో పవ్వళించి వున్నారట - ప్రాభాత సమీరాలు వారికి మేలుకొలుపులు పాడాయట - రా, త్వరగా విశ్వదర్శనం వేళ దాటుతున్నది'.

గదికి తాళం వేసి మల్లయ్య కుటుంబమూ, శ్రీనాథ దంపతులూ దేవాలయాభిముఖంగా పయనించారు.

ఇది నిత్యోత్సవం

వారోత్సవం

మాసోత్సవం

సంవత్సరోత్సవం -

ఇక్కడ ఋతువులతో ప్రమేయం లేదు -

ముహూర్తాలతో నిమిత్తం లేదు -

నిత్యకల్యాణం పచ్చతోరణం -

వేయి తిరణాల పెట్టుగా హడావుడి - ' అమ్మకాలు -రంగు రంగుల లక్కపిడతల దుకాణాల నడుమ నుండి స్వామి వారి బంగారు దేవాలయపు ప్రాంగణం చెంతకు చేరారు.

వడ్డికాసులు, బంగారుకాళ్లు, బంగారు చేతులు, వెండికాళ్లు, వెండిచేతులు అమ్ముతున్నాడొక బక్క పిల్లాడు. ' పద్మావతీ శ్రీనివాస కల్యాణం - స్థలపురాణం ఐదు రూపాయల గ్రంథం - రెండు రూపాయలు మాత్రమే ' ఇంకొకడు వచ్చాడు. ' రూపాయన్నర కిస్తావా? మల్లయ్య బేరమాడాడు - రూపాయి అర్వై పైసలకు బేరం కుదిరింది.

వెళ్ళి క్యూను చూశారు.

అది కొండవీటి చేంతాడులా చాలా పొడుగున ఉంది.

' రా, తాయారూ వెళ్ళి నిలబడదాం. '

' ఎక్కడ? ఈ క్యూలో మైలు దూరంలోనా నిలబడటం.'

' మరెక్కడ నిలబడదామనుకున్నావు? ఎన్నికల్లోనా?' పరిహాసం చేశాడు.

' బాబూ - ఈ గేటు దగ్గర రెండు రూపాయలు చేతిలో పెడితే పక్కకు మార్గం గుండా వదులుతాడు మనల్నీ' శ్రీనాథుడు నవ్వాడు. కాని మల్లయ్యను కించపరచ దలుచుకోలేదు.

' ఏమండీ - అలా చేద్దామా '

' పది నిమిషాల ఆలస్యం కోసం పాపం కొనుక్కుంటామా ? స్వామి వారి ప్రాంగణంలో' మెల్లగా అన్నాడు భార్యతో -

' ఇందులో తప్పేముందీ ?'

' ఎందరు భక్తులిలా క్యూలో అర్ధరాత్రి నుంచే నిలబడి వున్నారో తెలుసా? వారందరినీ మోసగించి లంచమిచ్చి స్వామి దగ్గరికి పోతే ఆయన ప్రసన్నుడవుతాడనుకున్నావా తాయారూ '-

మల్లయ్యా వాళ్లూ డబ్బిచ్చి లోపలికి వెళ్లారు -

శ్రీనాథుడు భార్యతో సహా పుష్కరిణి దగ్గరకు పోయి కొంచెం తీర్థం నెత్తిన చల్లుకొని వచ్చి క్యూలో నిలబడ్డాడు. దాదాపు పదిగంటలయ్యే సరికి క్యూలో కొన్ని ఫర్లాంగులు మిగిలిపోయింది -

' స్వామీ కాళ్లు నొప్పులు పుడుతున్నాయి - కాస్త కవిత్వంతో నా బాధ పోగొట్టండి - ఎలా వున్నదీ క్యూ? చాంతాడులా వున్నదా? హనుమంతుడి తోకలా వున్నదా? చెప్పండి కొంచెం '.

' కలకండ నందుకోవడం కోసం వెళ్ళే చీమల బారులా వున్నది తాయారూ -'

' దీపాన్ని అందుకోబోయే హారతి కర్పూరంలా లేదూ' -

' లేదు-'

' అదేమిటండీ మీ కలకండ కన్నా మంచి ఉపమానం చెప్పాను నేను - తన్ను తాను హారతి చేసుకునే భక్తుని హృదయం కర్పూరం లాంటిది.- అందులో ఎంత స్వచ్ఛత, పరిమళమూ వుంటుందో గమనించండి'.

' పూలవాసన నారకు పట్టినట్టే నీకు కవిత్వం అబ్బినందుకు నేను పరమానందం పొందుతున్నాను. నిజమే, కాని తాయారూ! నీ ఉపమానం చాలా లోపభూయిష్టమైనది. - భక్తుడు హారతి కర్పూరం వలె స్థాణువు కాడు. జడం కాదు. చీమ వలె నిరంతర వ్యాపకత్వం కల జీవి. చీమ వలె చిన్నవాడైనా నిరంతరం సంచలనం గల కుశాగ్ర బుద్ధి. లౌకికమూర్తి. ఆ చీమ వెళ్ళి కలకండను తాకినప్పు డింకేముంది? బ్రహ్మానందమే - అయితే తాయారూ! అంత బ్రహ్మానందంలో కూడా చీమ తన అస్తిత్వాన్ని కోల్పోదు. ఇక్కడే అనుభవించే దొకటి - అనుభవింపబడే దొకటి రెండూ వుంటాయి. హారతి కర్పూరం శూన్యవాదాన్ని ప్రతిపాదిస్తున్నది. తన్ను తాను మొత్తం నశింప జేసుకున్నప్పుడు అనుభవం ఎవరికి? దేవుడికా? '

(ఇంకా వుంది)

# స్వప్నభంగం – 4 (పెద్ద కథ)

*ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్,* ***Hyderabad, AP***

తాయారు భయపడి పోయింది. అందంగా ఉంటుందని ఓ ఉదాహరణ చెపితే దానిలో ద్వైత విశిష్టాద్వైతాలు ప్రతిపాదించాడు భర్త. దీనికంటే నిశ్శబ్దంగా కోతులనూ, బటానీ బుట్టలనూ చూస్తూ గడపడమే ఆమె ప్రాణానికి హాయిగా కనిపించింది.

దూరంగా స్వామి వారి ప్రాంగణం ముందు ఓ కారు ఆగింది. అందులో నుండి వైదేహి, లక్ష్మణమూర్తిగారు దిగడం మంగతాయారు చూసింది.

క్యూలో ఉన్న వారినీ లక్ష్మణమూర్తి చూసినట్లే వున్నాడు ........ చూశాడని స్పష్టంగా చెప్పలేము.

కానీ చూడనట్టే ముందుకు సాగిపోయారు.

ఛాయలా వైదేహి ఆయన్ను అనుసరించింది.

' ఏమండీ '

' ఆఁ '

' అదిగో మా అక్కా బావగార్లు వెళ్తున్నారండీ '

' అవును. వారేదో కల్యాణం లాంటిది చేయిస్తున్నట్లున్నారు.'

' ఇంకేం మరి. పదండి వెళ్దాం మనం కూడా. కల్యాణానికి కుటుంబం మొత్తాన్ని రానిస్తారు కదా.'

' కావొచ్చు తాయారూ! కాని ప్రవృత్తి యోగంలో స్వామిని ఇలా నిరాడంబరంగా శ్రమతో శ్రద్ధతో చూడటంలోనే నాకెక్కువ ఆనందం లభిస్తుంది.'

భర్త, తన అక్కా బావల ఐశ్వర్యానికి అసూయపడుతున్నాడేమోనని ఊహించింది తాయారు.

తేలికగానే ఆ భావాన్ని చదివాడా శ్రీనాథుడు అన్నట్టు ' స్వామి కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు చేయించవలసిందే - అవన్నీ మంచివే. కాని తాయారూ! నేను అర్థార్థిని కాను జిజ్ఞాసువును - ఇక్కడ నా వైభవమూ ధన ప్రదర్శనా కావు లక్ష్యాలు - స్వామి వారి వైభవం కావాలి - దానినొక సామాన్యునిలా భక్తి భిక్షాన్ని కోరే యాచకునిలా నిలబడి అందుకోవాలి - అది నా తత్వం.'

కొంతసేపైన తర్వాత కల్యాణాల వల్ల ధర్మదర్శనం నిలుపుచేయ బడిందని ప్రకటించారు.

తాయారు నిలువలేక పోయింది.

" పోయి కాఫీ తాగిరా - నేనిలాగే క్యూలోనే నిలబడి వుంటాను.'

మంగతాయారు కాఫీ తాగి వచ్చింది.

" మానవులంతా ఒక్కటే - మనది భారతదేశం కాదు. అనంత విశ్వం " అని ప్రపంచ పౌరసత్వాన్ని ప్రకటించుకునే రాజకీయ భక్తుడు, కుచేలుణ్ణీ, కురూపినీ మాత్రం మానవులుగా గుర్తించలేక పోతున్నాడు.

శ్రీనాథుని హృదయం భగ్గుమన్నది.

ఆ ఇంధనం నుంచి శబ్దాలు రవ్వల్లా రాలాయి.

" నరసింహమూర్తి వైనాడు వీవో స్వామి
శత్రుముష్కరచమూ సైన్యధాటికి ప్రతిగ
భంభరమ్ముల పంపి పారద్రోలితివి కద!"

దర్శనం నిలుపుదలతో చాలా మంది క్యూ నుండి వెళ్ళిపోయారు. అందువల్ల శ్రీనాథుడు ఎంతో ముందుకు వచ్చాడు.

కుష్టురోగులూ, బిచ్చగాళ్ళూ పోతున్నారు గుంపుగా.

" అయ్యా ఒక్క పైసా వెయ్యండి. బాబూ! ధరమం తండ్రీ! ఒక్కపైసా దానం చేయండి - ఏడుకొండలవాడా!"

ప్రజలు అసహ్యించుకొంటున్నారు.

మృత్యువును చూసినట్లు దూరంగా తొలిగిపోయారు.

సర్వాంతర్యామి అయిన ఈశ్వరుణ్ణి ముష్టి వాళ్ళలో చూడలేని భక్తులు స్థాణువు కోసం పరుగెత్తుతున్నారు.

భక్తులను రక్షించి ప్రతిన నిలిపితివి కద!
ఏమయ్యె ఆనాటి శక్తి?
నేడు
ఎటకేగెనయ్య నీ మహిమ?
రాక్షస హిరణ్యకశ్యపు చంపి అలనాడు
రక్షించి ప్రహ్లాదు నాహ్లాద పరచితివి.
కడుపులోనే కాదు గోడలో భూమిలో
కనకమ్ము గుప్త పరచిన హిరణ్యాసురుల
కాల్పరాదేల నీ అగ్ని ప్రభవించి
కూల్పరావేల స్తంభమున?"

తాళ్ళపాక వంశస్థుల రక్తం తనలో పారుతున్నదో ఏమో శ్రీనాథుడు స్వామికి అలా విన్నపాలు చేస్తున్నాడు.

ఎండతో బాటు అతని భావ తీవ్రత కూడా పెరిగింది.

"ఈ సమానత మిథ్య
ఇట దుష్టత - అపథ్య-??
రసశూన్యమైన మా

నవతయే సత్యమ్ము

కరిగి పొర్లవదేం స్వామి ఆకాశ

గంగగా కరుణ(ం) తరంగ!!"

కళ్యాణోత్సవాలు ముగిశాక లడ్డూలు, అప్పాలూ, నెయ్యి కాల్వగట్టి కారుతున్న పొంగలి బుట్టలూ, దధ్యోజనం, చక్కెర పొంగలి భక్తులకు అందించారు అర్చకులు - లడ్డూల బుట్టలు కారులో కెక్కించుకొని తలుపులేసుకున్నాడు లక్ష్మణమూర్తి.

వైదేహి ఇటు చూసింది -

క్యూలో శ్రీనాథుడు మంగతాయారూ -

' అరె - మీరు రాలేదేమిటి కాటేజికి'.

శ్రీనాథుడు నవ్వాడు.

' తెలిసిన వాళ్ళు గుడికి దగ్గరలో దిగారు. నడకతో, కాళ్ళు వాచి కటేజీ దాకా రాలేకపోయానక్కా'.

లక్ష్మణమూర్తి శ్రీనాథుని చూసి పలకరింపుగా తల ఊగించాడు.

వైదేహి కారులో నుంచి లడ్డూలు తెచ్చి ఇద్దరికి ఇచ్చింది.

ప్రసాదం తీసుకున్నారు.

'డబ్బులిస్తాము - అమ్మా ! ప్రసాదం అమ్ముతారా?' ఎవరో వైదేహిని అడుగుతున్నారు.

సాభిప్రాయంగా భర్త వైపు చూసింది వైదేహి.

లక్ష్మణమూర్తి వారితో బేరమాడుతున్నాడు.

' సాయంత్రమన్నా రండి కాటేజికి ' వైదేహి మళ్ళి అర్థించింది.

అలాగేనని తలఊపింది తాయారు.

వైదేహి కారెక్కింది.

కారు సాగిపోయింది.

ధర్మ దర్శనాలు మళ్ళీ ప్రారంభమైనాయి.

' ఏడు కొండలవాడా! వెంకట్రమణా ! గోవిందా! గోవిందా!'

శ్రీనివాస దివ్య అవతార గాథా వివరణాత్మక చిత్రాలతో స్థగితమైన కుడ్యాంతరం నుండి సుదీర్ఘమైన క్యూ ప్రవాహంలా సాగుతున్నది .

ఈశ్వరాభిముఖంగా పయనించే భక్తిరస ప్రవాహం మధ్య వికసించిన కమలాల్లాగా కొన్ని వందలమంది శ్రీనాథులు, తాయారులు - మల్లయ్యలు.

కొన్ని తెల్ల కమలాలు - కొన్ని ఎర్రని కలువలు - మరికొన్ని నల్ల కలువపూలు .

'ఆపద్బాంధవా - అనాథరక్షకా - గోవిందా, గోవిందా'.

శ్రీనాథుడు స్వామి వారి దివ్య మంగళ విగ్రహ సాన్నిధ్యానికి పత్నీ సమేతుడై చేరాడు.

తన అపాంగం ద్వారా విశ్వాన్ని శించితం చేస్తున్న సర్వశక్త సమన్వితుడైన దయామూర్తి.

కళ్యాణధాముడు -

శ్రీనివాస వరదుడు -

తాయారు భక్తి ప్రవాహంలో తలమునకలైంది - శ్రీనాథుని హృదయంలో స్వామి ప్రతిబింబిస్తున్నాడు - అద్దంలో జ్యోతిలా -

'స్వామీ! నాకు సమస్త ఐశ్వర్యారాలనూ ప్రసాదించు - సుపుత్రప్రాప్తిని కలిగించు - నాభర్తను అర్థార్థిగా మార్చు - అర్థమంటే శబ్దార్థం కాదు - ధనం స్వామీ ధనం -'

"నడవండి - నడవండి" అర్చకులు పంక్తిని తొందరలో ఎవరో చెయ్యి అడ్డం పెట్టినట్లనిపించింది. బయటకు నడిచాడు నిశ్శబ్దంగా.

మంగతాయారు తీర్థయాత్ర సఫలమైందన్నట్లు ఆమెకు నెల తప్పింది. శ్రీనాథుడు సంతోషించాడు.

'మన ఇంట్లో ఓ చిన్న శశి ఉదయించబోతున్నది' అన్నది తాయారు. 'శశి కాదు శశం - ఓ కుందేలు పిల్ల పుడుతుంది.' గునగున లాడుతూ అన్నాడు శ్రీనాథుడు.

' ఇలా రండి'

' ఏమిటి ' దగ్గరగా వెళ్ళాడు.

' నాదో చిన్న కోరిక -'

' ఏమిటి?? '

' నాకు పుట్టే బిడ్డడిని జంతువుల పేర్లతో పక్షుల పేర్లతో పిలవడానికి వీలులేదు'-

'తాయారూ సృష్టిలో అవే చాలా అందమైనవి కదా!'

' అంటే మానవుడు కాదా! సింహమెన్నడన్నా' 'నరాధీరా!' అని పిలుచుకుంటున్నదా! ఆడసింహాన్ని ' నారీమధ్యా ' అన్ని సంబోధిస్తున్నదా! క్రూరమైన అడవి జంతువులనూ నీచు తినే మృగాలనూ కోళ్ళనూ కొక్కిరాయిలనూ గొప్ప వాటిని చేసి వాటితో నదులనూ పోలుస్తూ ఇదేదో ఉత్తమజాతి కవిత్వమని భ్రమింపజేస్తారా? సిగ్గులేదండీ మీ కవులకు. మానవుడి నిలా కించపరచడానికి'.

'తాయారూ - చర్చవద్దు. కాని సృష్టిలో ఒక్కో జీవజంతువుకు ఒక్కొక్క అందం వుంది. రేఖా మాత్రమైన ఆ ఒక్కొక్క సౌందర్యాన్ని మానవుడి ఒక్కొక్క అంగానికి ఆపాదించడం మానవుడు సర్వోన్నతమైన వాడని నిరూపించడమే కవుల తాత్పర్యం.'

'ఈశాస్త్రాలూ, అలంకారాలూ నాకు తెలియవు - నాబిడ్డడిని అసలు కవిని చేయడానికే వీలులేదు. హాయిగా ఏ డాక్టరునో, ఇంజనీరునో చెయ్యాలి. వెర్రి మొర్రి కవిత్వాలతో చెట్లూ పుట్టలూ పట్టి తిరగకుండా బ్రతుకుతాడు. దోసెళ్ళతో సంపాదించుకుంటాడు'.

'తాయారూ! కవి ఘనతను గుర్తించేందుకు నీ జన్మ చాలదు. అర్థ జీవనం శబ్దాన్ని దిగమింగుతుందనే భయంతో పేదవాడుగా జీవిస్తాడు దారిద్ర్యాన్ని కోరి వరిస్తాడు. కుక్కిమంచంలో సాలెగూళ్ళ మధ్య పడివుండి భావసౌధాలు నిర్మించి మానవాళికి కానుకగా సమర్పిస్తాడు - నాకొడుకు కవి కాగలిగితే అది పూర్వ జన్మ పుణ్యఫలమనుకుంటాను'.

తాయారు కోపంగా వెళ్ళి పోయింది.

అంతటితో ఆ సంభాషణ ముగింది.

తమ ఇంట్లోకి మూడో జీవి ప్రవేశిస్తుందనగానే తాయారుకు ఆర్థికమైన భయం పట్టుకున్నది.

చాలీచాలని ఈ ఆదాయంతో సంసారం ఎలా చేయడం??

తెలుగుదేశంలో కవిత్వానికి విలువ తక్కువ.

మహాకవులకు గుర్తింపు శూన్యం -

బ్రతికిన వాళ్ళను చచ్చేవరకూ తిట్టి చచ్చిన తర్వాత సన్మానాలూ వర్ధంతులూ చేస్తారు-

ఇదేం ఇంగ్లీషు దేశం కాదు, పుస్తకాలమీద బ్రతకడానికీ కోట్లు సంపాదించడానికి.

అయినా తన భర్త కవి అని నమ్మకమేమిటి?

నీ ముఖం చంద్రునిలా వుంది - నీ గొంతు కోయిలలా వుంది అంటూ వేల సంవత్సరాల పాత చింతకాయ పచ్చడినే మళ్ళీ మళ్ళీ ప్రయోగిస్తూ మనుషుల ప్రాణాలు తీయడం కవిత్వమా? నన్నయ్యకు రాజరాజు గుర్తింపు వుంది.

శ్రీనాథుడికి రెడ్డిరాజులు శరణుజొచ్చారు.

పెద్దనకు రాయలవారు దాసోహమన్నారు.

వెంకన్నను రఘునాథుడు ఇందిరా మందిరానికి పట్టాభిషేకం చేశాడు. తన భర్త అలాంటి కవా? అయితే ఈ ముష్టి శాలువా లేమిటి?

ఒక్క రచనకూ బహుమతి ఎందుకు రాలేదు? ఒక్కచోటా వెయ్యి నూట పదహార్లిచ్చి ఎందుకు ఏనుగు ఎక్కించలేదు.??

తాయారు తన భర్త కవి కాడని కేవలం ఒక రకమైన చపల చిత్తుడని నిశ్చయించుకున్నది.

అందుకే బంధువుల్లో ఎవరైనా 'మీ ఆయన కవిట కదా'! అన్నా, 'మీవారి కవిత్వం నేను చదివాను చాలా బాగుంది' అన్నా సిగ్గుపడటం మొదలు పెట్టింది.

తాయారుకు ఏడవ నెల వచ్చింది. శ్రీనాథుని ప్రకృతి పూజలో కించిత్తయినా మార్పు రాలేదు.

పుట్టింటి వారు శ్రీమంతానికి తీసుకు వెళ్ళారు కూతురినీ, అల్లుడినీ. శ్రీనాథుడు భార్య ముచ్చట తీర్చడం కోసం బయలుదేరాడు. చిలకలూరి పేటకు బస్సు ప్రయాణం-

రామానుజస్వామి, పేరిందేవి, కూతురినీ, అల్లుడినీ ఆదరంగా చూశారు.

సంప్రదాయానుసారం వైష్ణవ పూజలు వగైరా జరిపించి శ్రీమంతానికి ఊళ్ళో అందరినీ పేరంటానికి పిలిచారు. రేపు శ్రీమంతమనగా అకస్మాత్తుగా హైదరాబాదు నుండి లక్ష్మణమూర్తి, వైదేహి వచ్చారు.

పేరిందేవి పరమానంద భరితురాలైంది. తిరుపతి వెళ్ళినప్పుడు కూడా పేట మీదుగా వెళ్తూ ఆగలేదు. లక్ష్మణమూర్తయితే అసలు రానేరాడు.

ఈసారి కూడా వచ్చేవాడు కాదని, గుంటూరులో వైన్ కాంట్రాక్టు ఒకటి వుండి బయలుదేరాడని చెల్లెలి శ్రీమంతం వార్త జాబు చేరి వుండటం వల్ల తను కూడా వస్తానని పట్టుబట్టిందనీ చెప్పింది వైదేహి.

'నీవు రావడంతో నిజంగా ఇది నాకో పండగయింది అక్కయ్యా' అన్నది మంగతాయారు.

రామానుజస్వామి శ్రీనాథుడితో ఆత్మీయునిలా వ్యవహరించాడు. కవిత్వాన్ని గూర్చి, వేదాంతాన్ని గూర్చి చర్చలు జరిపాడు. కాని లక్ష్మణమూర్తితో ఒక ఆఫీసరు పట్ల చూపినట్లు గౌరవం చూపాడు. ఒక అధికారికి జరిపిన లాంఛనాలు జరిపాడు.

ఆ భేదం గమనించింది మంగ తాయారు.

మంగతాయారు మనస్సును మాటల్లోకి అనువదించుకున్నాడు శ్రీనాథుడు. 'గౌరవింపబడటం కన్నా ప్రేమించబడటం గొప్పదన్న విషయం తాయారు కెలా తెలుస్తుంది?' అనుకున్నాడు.

లక్ష్మణమూర్తి పెద్ద చదువుకున్నవాడు కాదు - అలాంటప్పుడు ఆయనతో శ్రీ భాష్యం వగైరా తనతో ముచ్చటించినట్లు మామగారెలా ముచ్చటిస్తారు? పైగా లక్ష్మణమూర్తి ధనవంతుడు, డాబూ దర్పం కలవాడు, కొంచెం ముక్కోపి కూడాను.

కాబట్టే తదనుగుణంగా ప్రవర్తించ వలసిన బాధ్యత అత్తమామలపై ఉందని శ్రీనాథుడికి తెలుసు.

కాని మంగతాయారుకు తెలియదు. మర్నాడు గాజులు వేయించారు.

తొమ్మిది రంగుల గాజులూ నవరసాలను పలికించాయి - తొణికించాయి. శ్రీనాథుడికి ఎదలో,

'నా బిడ్డ రస స్వరూపుడు కావాలి. శబ్ద బ్రహ్మోపాసకుడు కావాలి' అని సంకల్పించాడు ఆ ముహుర్తాన.

ఆ రోజు సాయంత్రం ఉన్నట్టుండి సుడిగాలి వచ్చింది - పేటలోని పొగాకు కేంద్రాలలో పరదాలు, రేకులు కూడా కొట్టుకొని పోయాయి.

అందువల్ల పేరంటం అనుకున్నంత వైభవంగా జరగలేదు. ఎక్కువ మంది పేరంటాండ్రు రానేరాలేదు. - పైగా వైదేహికి చేసిన సీమంతంలా ఇది లేదని ఎందుకో అనిపించింది తాయారుకు.

అదే ఆత్మీయత, అదే అనురాగం.

కాని ఆ అంతస్థు వేరు. ఈ అంతస్థు వేరని తోచింది - 'అక్క పెద్దది - పైగా మొదటిసారి - అప్పుడు నాన్నకు సంపాదన ఇంకా బాగుండేది అని తృప్తి పడాలని ప్రయత్నించినా తాయారుకు మనస్సు కుదుటపడలేదు. సమాధాన పడలేదు - 'నా భర్త మా బావ కన్నా తక్కువ అంతస్థు కలవాడు. అందుకే ఈ తేడా' అని ఆమె హృదయంలో ఏదో ఒక శక్తి ప్రతిధ్వనించడం మొదలు పెట్టింది. తమ ఆర్థికమైన న్యూనత వల్లనే సీమంతం వైభవోపేతంగా జరగలేదనే ఒక భావం సుడిగాలిలా ఆమెలో చెలరేగింది.

(ఇంకా వుంది)

హైదరాబాదులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనుబంధసంస్థ ఇంటర్నేషనల్ తెలుగు సెంటర్ వారి ఏడవ తెలుగు మహాసభలు 2000 సంవత్సరంలో బెంగుళూరు నగరంలో నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. తేదీ, మిగతా వివరాలు ముమ్ముందు తెలియజేయగలము.